క్లుప్తంగా

సహాయక చర్యల పరిశీలన



చింతలమోరిలో మెడికల్ క్యాంపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: తుపాను నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహించిన సహాయక చర్యలను మంగళవారం ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలించారు. మండలంలోని చింతలమోరిలో తుపాను ఆశ్రయ భవనంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు, ఆహార పదార్థాల అందజేతను ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



పి.గన్నవరం మండలంలో పశువుల శాలలో పాడి రైతుతో మాట్లాడుతున్న విజయారెడ్డి

పి.గన్నవరం: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు(ఏడీ) ఎల్.విజయారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ఎల్.గన్నవరం, ఊడిమూడి గ్రామాల్లో మంగళవారం ఆయన పశువుల శాలలను పరిశీలించి, పాడి రైతులతో మాట్లాడారు. పశువులను రాటలకు కట్టకుండా విడిగా వదిలేయాలని అన్నారు. వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పశు వైద్య సహాయకులంతా అందుబాటులో ఉన్నారని ఆయన వివరించారు. అత్యవసర సమయంలో పశు వైద్య సహాయకులను సంప్రదించాలని ఏడీ పాడి రైతులకు సూచించారు.

స్వామివారి సన్నిధిలో ఎమ్మెల్యే కుటుంబం



అంతర్వేది ఆలయంలో ఎమ్మెల్యే రాపాక కుటుంబ సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుటుంబ సభ్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే కుమారుడు వెంకట్ రామ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి వచ్చి వెంకట్‌రామ్ ఈ పూజలు చేశారు. పూజలు అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి లడ్డు ప్రసాదాన్ని సూపరింటెండెంట్ పి.విజయసారథి అందజేశారు.

ఘనంగా అష్టోత్తర పూజలు



అష్టోత్తర పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అష్టోత్తర పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం, తీర్థప్రసాదం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తరాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

ప్రధాని మన్‌కీబాత్‌ను వీక్షించాలి



జి.అగ్రహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, అధికారులు, గ్రామస్తులు

అంబాజీపేట: ప్రతి నెలా జరిగే ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించాలని ఈఓపీఆర్డీ బి.మమత అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజలందరి కోసం ప్రధాని మోదీ ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం, ఉపాధి హామీ పథకం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం సంకల్ప యాత్రపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విత్తనాల శేఖర్, బంధన రాంబాబు, రాయుడు చంటి తదితరులు పాల్గొన్నారు.



కె.పెదపూడిలో జేసీబీతో పూడిక తీసి ముంపు నీటిని బయటకు తరలిస్తున్న దృశ్యం



నరేంద్రపురంలో వరిచేలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ముక్కంటి



అయినవిల్లి ముంపు నీటిని మళ్లిస్తున్న అధికారులు



అప్పనరామునిలంకలో గాలుల తీవ్రతకు దెబ్బతిన్న రేకుల షెడ్డు



నగరంలో ధాన్యం రాశి చుట్టూ చేరిన ముంపు నీరు

వరికి వాయుగండం

- నేలకొరిగిన వరి పంట
- ఆందోళనలో అన్నదాత
- పంట రక్షణ, నష్టం పరిశీలనలో అధికారులు

కొత్తపేట: తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పంటకు ముప్పు ఏర్పడింది. ఆదివారం నుంచి ఒక మోస్తరుగా వర్షం కురవగా కోత కోయని పంటకు నష్టం లేదనుకున్న ఆ రైతులకు సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఆ పంట నేలనంటింది. మంగళ, బుధవారాలు కూడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నియోజకవర్గ పరిధిలో 26,022 ఎకరాల్లో వరి సాగు చేయగా 16,901 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇంకా 9,121 ఎకరాల్లో పంట కోయవలసి ఉంది. కోతలు పూర్తయిన దానిలో సుమారు 10 వేల ఎకరాల ధాన్యం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా, ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు విక్రయించగా సుమారు 6,900 ఎకరాల విస్తీర్ణంలో ధాన్యం రాశులుగా ఉంది. వ్యవసాయ అధికారులు తెలిపిన ప్రాథమిక అంచనాల ప్రకారం వరి విస్తీర్ణం, కోతలు, పంట నష్టం వివరాలిలా ఉన్నాయి. చేలల్లో, ధాన్యం రాశుల్లోకి చేరిన నీటిని బయటకు మళ్లించే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమయ్యారు.

తుపాను భారీ వర్షాలకు పూర్వం నుంచి సాగు చేస్తున్న ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం తట్టుకోదని, దాని స్థానంలో తట్టుకుని నిలబడే ఎంటీయూ 1318 కరం సాగు చేయాలని వ్యవసాయాధికారుల సూచన మేరకు ఆ రకాన్ని సుమారు 70 శాతం మేర సాగు చేశారు. ఆలస్యంగా కోతకు రావడంతో ఈ తుపాను ముప్పుకు గురయింది. ఈదురు గాలులు, వర్షానికి చాలా వరకు పంట నేలనంటిందని రైతులు వాపోయారు. పడిపోయిన పంటను, తడిసిన పనలు, ధాన్యాన్ని వివిధ రూపాల్లో కాపాడుకోవాలని స్థానిక ఇన్‌చార్జ్ ఏడీఏ నాగేశ్వరరావు రైతులకు సూచించారు. చేలల్లో నీరు బయటకు మళ్లించాలని సూచించారు. పడిపోయిన పంట, పనలపై ఊక, ఉప్పు కలిపి చల్లుకోవాలని, 5 శాతం ఉప్పు ద్రావణం రూపంలో కూడా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. పడిపోయిన వరి 2, 3 దుబ్బులను కలిపి కట్టి నిలబెట్టాలని సూచించారు.

వీడని ముసురు..

అంబాజీపేట: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పౌర జీవనానికి అంతరాయం ఏర్పడింది. మండలంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షానికి జడిసి ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేదు. రోడ్లు, డ్రైన్లు పలు గ్రామాల్లో నీట మునిగాయి. భారీ వర్షాలకు వరి చేలు నేలనంటడంతో నీటిలో నానుతున్నాయి. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రోడ్లపైనా రాశులుగా పోసి రైతులు బరకాలు కప్పి ఉంచారు. నేల నంటిన ధాన్యం రాలిపోయి, దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జనజీవనం అస్తవ్యస్తం

అలమూరు: తుపాను ప్రభావంతో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ప్రజానీకం బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల గృహ యజమానులు ఇళ్ల బయట మెరక చేసుకోవడంతో వర్షపు నీరు డ్రైనేజీలోకి వెళ్లక రోడ్లన్నీ తీవ్రంగా దెబ్బతింటున్నాయి. తుపాను ప్రభావంతో ఇటుక బట్టీ కార్మికులు, కూలీలు తమ ఉపాధిని కోల్పోయారు. మరో పది రోజుల వరకూ ఉపాధి దొరకని పరిస్థితి నెలకొంది.

ముంపు నీటి తరలింపునకు చర్యలు

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వరి చేలు నీట మునిగిపోకుండా ముంపు నీరు బయటకు తరలించేందుకు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ టి.మంగతాయారు తెలిపారు. కె.పెదపూడిలో పంట కాలువల పూడికతీతను జేసీబీ సాయంతో మంగళవారం తీశారు. తహసీల్దార్ మంగతాయారు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో వరి చేలు ముంపు బారిన పడకుండా పంట కాలువలను, డ్రైన్‌లను శుభ్రం చేస్తున్నామన్నారు. నేలనంటిన వరి చేలకు వ్యవయసాయాధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు.

భారీ వర్షాలతో రైతాంగానికి తీవ్ర నష్టం

పి.గన్నవరం: పంటలు చేతికి వచ్చే సమయంలో తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో తీవ్ర నష్టాలకు గురయ్యామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 6058 ఎకరాల్లో వరి పంట వేయగా సుమారు 2200 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలతో పలు గ్రామాల్లో వరి చేలు నీట మునిగాయి. చాలా చోట్ల వరిచేలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముంపునకు గురైన చేలలో వర్షం నీటిని బయటకు పోయేందుకు మార్గాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు శ్రమిస్తున్నారు. మంగళవారం కూడా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. తరచూ విద్యుత్ సరఫరా నిలిచి పోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: మండలంలోని పలు గ్రామాల్లో మిచాంగ్ తుపాన్‌ను ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు వరి చేలు నేలనంటాయి. అలాగే ఉద్యాన పంటలు అరటి, కంద, పసుపు తదితర పంటలు వర్షాలతో కొంత మేర రైతులకు నష్టం చేకూరుతుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. అలాగే పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముంపు చేలను పరిశీలించిన ఆర్డీఓ

మండలంలో నరేంద్రపురం, రాజులపాలెం, పోతవరం గ్రామాల్లో ముంపునకు గురైన వరిచేలను, ధాన్యం రాశులను కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి మంగళవారం పరిశీలించారు. వర్షం తగ్గిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆయన ఆర్‌బీకేల సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మండల ఏవో కళ్యాణ్‌కుమార్ ఉన్నారు. ధాన్యం రాశుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

వరిచేలు, ధాన్యం రాశుల పరిశీలన

అయినవిల్లి: తుపాను కారణంగా మండలంలోని అయినవిల్లి, విలస, సిరిపల్లి, మాగాం, నల్లచెరువు గ్రామాల్లోని నేలకొరిగిన వరిచేలను, తడిచి ముద్దయిన ధాన్యం రాశులను తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తడిచిన, నేలకొరిగిన వరిచేలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మునిగిన వరిచేలను రక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. మురుగు కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. నల్లచెరువు గ్రామంలో మురుగు కాలువలో తక్షణమే గుర్రపుడెక్క తొలగింపునకు మండల వ్యవసాయ అధికారి వై.శోభ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.



కొత్తపేట పెదగూళ్లపాలెంలో వర్షపునీటిలో నానుతున్న వరి పంట

మోరిలో తుపాను బీభత్సం

సఖినేటిపల్లి: మండలంలోని మోరిలో మంగళవారం మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది. సెకను కాలం పాటు సృష్టించిన ఈ బీభత్సంలో పీహెచ్‌సీకి సమీపాన ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న చెట్లను, విద్యుత్ స్తంభాలను నేలకూల్చింది. రహదారి వెంబడి నివాసం ఉంటున్న కుటుంబాలు హడలెత్తించింది. సుమారు 12 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెరిగిన గాలులు తీవ్రతకు టోర్నడోను తలపించే రీతిలో సుడిగాలి వచ్చింది. దీని ధాటికి భారీ చెట్లు కూలిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే గ్రామ సరిహద్దులోని వీవీ మెరకలోని రొయ్యల చెరువుల వద్ద కూడా గాలులకు కొబ్బరిచెట్లు చెరువుల్లో పడిపోయాయి. కాగా సుడిగాలికి అప్పనరామునిలంకలో గెద్దాడ వెంకటేశ్వరరావు రేకుల షెడ్డు ఇల్లు దెబ్బతింది. ఇంటి పైకప్పు రేకులు గాలుల తీవ్రతకు ఎగిరిపోయాయి. ఇదిలా ఉండగా కేశవదాసుపాలెం గిరిజాపతి కాలనీలో తహసీల్దార్ వై.రామకుమారి పర్యటించారు. గ్రామంలోని తుపాను షెల్టర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలి వచ్చి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని తీసుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. ఆర్ఐ వీవీ రామరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి శామ్యూల్ ప్రణయ్, వీఆర్వో నాగరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు రైతులను నిలువునా ముంచాయి. మామిడికుదురు, నగరం, పెదపట్నం, గెద్దాడ, ఈదరాడ, పాశర్లపూడి తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన పంట ముంపుబారిన పడింది. భారీ వర్షానికి ఈదురు గాలులు తోడు కావడంతో కోతకు వచ్చిన పంట నేల మట్టమైంది. కళ్లాల్లో ధాన్యం రాశులు రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ధాన్యం రాశుల చుట్టూ ముంపు నీరు చేరడం రైతులను కలవర పెడుతోంది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అంధకారంలో గడుపుతున్నారు. కాలనీలు, ప్రధాన రహదారులపై భారీగా ముంపు నీరు చేరడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుపాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముంపునీరు భారీగా నిలిచిపోయిన చోట ఉపాధి కూలీలతో యుద్ధ ప్రాతిపదికన కచ్చా డ్రైన్లు తవ్వించారు. డీసీఓ వి.కృష్ణకుమారి పాశర్లపూడిలో పర్యటించారు. కృష్ణశర్మ కాలనీతో పాటు సత్తరువుతోటను పరిశీలించి రెండు చోట్ల ముంపునీటి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సముద్ర తీరంలోని కరవాకలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ పర్యటించి అక్కడి పరిస్థితిని సమీక్షించారు.

కాలనీల్లో ముంపునీరు తొలగింపు

అయినవిల్లి: తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో కాలనీలు ముంపునకు గురయ్యాయి. అయినవిల్లిలోని పెదపేటలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముంపునీరు మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ముంపునీరు మళ్లించి కాలనీ వాసులు వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

కుండపోత

రావులపాలెం: తుపాను ప్రభావంతో మంగళవారం కుండపోత వర్షం కురుస్తుంది. దీంతో రోడ్డుపై వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో గ్రామాల్లో అంధకారం నెలకొంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలు నీటి మునిగాయి. స్థానిక జూనియర్ కళాశాల గ్రౌండ్, రావులపాలెం బస్టాండ్ వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాలకు రావులపాలెం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమయింది. ప్రాంగణం పూర్తిగా నీట మునగడంతో బస్సుల రాకపోకలు నిలిపివేశారు. అధికారులు మోటారు ఇంజిన్ సాయంతో నీటిని తోడుతున్నా కుండపోతగా కురుస్తున్న వర్షంతో నీరు చేరుతుంది.



లూటుకుర్రులో ముంపు నీటి మళ్లింపునకు కచ్చా డ్రైన్ ఏర్పాటు



చెరువులా మారిన రావులపాలెం బస్టాండ్



నల్లచెరువులో గుర్రపుడెక్క తొలగింపును పరిశీలిస్తున్న ఏవో వై.శోభ

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



నగరంలో ముంపుబారిన పడిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ముంపుబారిన పడిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారిని పూర్తిగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. ఆయన మంగళవారం నగరంలో ముంపుబారిన పడిన పంట పొలాలను పరిశీలించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను పరిశీలించారు. నగరం మార్కెట్ యార్డ్ గొడౌన్‌తో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి ధాన్యం తరలించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా తేమశాతం ఎంత ఉన్నప్పటికీ దాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, ఏఓ బి.మృదుల, ఆన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ రమేష్‌బాబు ఆయన వెంట ఉన్నారు. అనంతరం యానాదుల కాలనీని సందర్శించారు. భారీ వర్షాల వల్ల మూడు రోజుల నుంచి వేట లేక ఉపాధి కోల్పోయి అల్లాడుతున్నామని యానాదులు వాపోయారు. వారికి తక్షణం సహాయం అందించి వారిని ఆదుకుంటామని చిట్టిబాబు తెలిపారు. ఆయన వెంట కోఆప్షన్ సభ్యుడు నూర్జైన్ అబ్బాస్, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, పార్టీ నేతలు గుబ్బల శ్రీనివాస్, జాలెం కృష్ణారావు, తోట రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవం



రామరాజులంక బ్యాంక్‌లో కేక్ కట్ చేసిన మేనేజర్ శివరామిరెడ్డి

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో ప్రభుత్వ రంగ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శివరామిరెడ్డి ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఖాతాదారులంతా బ్యాంక్ సేవలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని కోరారు. గ్రామ ప్రజలు బ్యాంక్ అభివృద్ధికి ఎంతో సహకరించారని తెలియజేశారు. ప్రథమ సంవత్సరంలో తమ శాఖ 11 కోట్లకుపైగా వ్యాపారం చేశామని తెలియజేశారు. బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలు, బంగారు నగలపై రుణాలు, వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు మొదలైన అన్ని రకాల రుణ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. డిపాజిట్లపై అత్యధిక వడ్డీ చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ బ్యాంకు అని తెలియజేశారు. రీసెంట్‌గా తమ బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం వాట్సాప్ బ్యాంకింగ్ సేవలు, కస్టమర్ కేర్ టోల్ ఫ్రీ సెంటర్‌ను ప్రారంభించారని అందరూ ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. తమ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి బ్యాంక్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ మేడిచర్ల గంగరాజు, క్యాషియర్ రత్న, బ్యాంక్ ప్రిమైసెస్ ఓనర్ మేడిచర్ల వెంకటరామారావు, గ్రామ ప్రజలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై దృష్టి సారించాలి

అలమూరు: మండలంలోని పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించడంతో పాటు ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీపై దృష్టి సారించాలని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా గ్రామాల పీహెచ్‌సీలలో మంగళవారం వైద్యారోగ్య, ఆశ సిబ్బందికి సమావేశం జరిగింది. నవంబర్ నెలలో సాధించిన వలసిన ప్రగతిని అధికారులు వివరించారు. గ్రామ సచివాలయాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వివరించి ఆరోగ్య సేవలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడి కుటుంబానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.16 వేల ఆర్థిక సాయం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన జక్కంశెట్టి జితేంద్ర వారం రోజుల క్రితం తణుకు హైవే మీద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతడి వైద్యానికి ఇప్పటికే రూ.లక్ష వరకూ ఖర్చు చేశారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో సహాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా మంగళవారం బాధితుడి అన్నయ్య శ్రావణ్‌కుమార్‌కి రూ.16 వేల నగదు సాయంగా సంస్థ సభ్యులు అందజేశారు.

నేడు కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కుల గణన కార్యక్రమంపై క్షేత్ర స్థాయిలో అభిప్రాయాలను తెలుసుకోవడం, కార్యాచరణపై చర్చించేందుకు బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లను ఆహ్వానించినట్టు ఎంపీడీఓ తెలిపారు.

పాక కూలి లేగ దూడ మృతి

మలికిపురం: తుపాను కారణంగా వీచిన గాలులకు మండటంలోని గుడిమెళ్లంకలో జిల్లెళ్ల రమణకు చెందిన పశువుల పాక కూలిపోయింది. అందులో ఉన్న గేదె దూడ మృతి చెందింది. తహసీల్దార్ జీవీఎల్ నరసింహారావు, ఏఈ రాకేశ్ తదితరులు మండలంలో పర్యటించారు. 48 ఎకరాల్లో పంట నష్టం సంభవించినట్లు నరసింహారావు తెలిపారు.

తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: భారీ వర్షాలకు కొబ్బరితోటలు నీట మునిగిపోవడంతో విష సర్పాలు ఇళ్లలోకి చేరుతున్నాయి. దీనిలో భాగంగానే అంబాజీపేట మండలం గంగలకురు అగ్రహారంలో తాచుపాము హల్ చల్ చేసింది. శింగంశెట్టి వెంకట నాగభూషణంకు చెందిన వంట గదిలోకి పాము రావడంతో అతని కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురయ్యారు. దాంతో స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం ఇవ్వడంతో చాకచక్యంగా తాచుపామును పట్టుకుని ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం జనసంచారం లేని ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.

శబరిమల యాత్రకు రెండు ప్రత్యేక బస్సులు



రావులపాలెం డిపో నుంచి శబరిమల యాత్రకు బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి రెండు ప్రత్యేక బస్సులను శబరిమల యాత్రకు పంపినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. మండపేట స్వాములు ఒక బస్సు, జొన్నాడ స్వాములు ఒక బస్సులో శబరిమలయాత్రకు బయలు దేరారన్నారు. ఏడు రోజుల యాత్ర కాణిపాకం, శ్రీపురం, పళని, త్రివేంద్రమ్, పంబ, శబరిమల, తిరుపతి, విజయవాడ దర్శనం అనంతరం రావులపాలెం చేరుతుందన్నారు. అలాగే మొత్తం రావులపాలెం డిపో నుంచి ఈ సీజన్‌లో 10 బస్సులు శబరిమల వెళ్లుటకు సిద్ధం చేసినట్టు డీఎం తెలిపారు.

ఈనెల 8న జాబ్‌మేళా

మామిడికుదురు: స్థానిక దీప్తి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 8న వికాస ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ-సర్వీస్‌లో బీపీఓ, డిక్సాన్, సియోన్ ఈ-హెచ్‌డబ్ల్యూ సుమిత్, ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తారని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని చెప్పారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి కల్పిస్తారని సత్యనారాయణ తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8వ తేదీ ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్, జెరాక్సులతో హాజరు కావాలని కోరారు.

టెండర్ ప్రకటన

లేఖ సంఖ్య :ఎ1/198/2023 తేది.05.12.2023

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం మరియు గ్రామములో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ముక్కోటి ఏకాదశి (డిసెంబర్-24), జనవరి-1 - భోగి (జనవరి-14) తేదీలలో శ్రీ స్వామి వారి ప్రధాన ఆలయం, తూర్పు, దక్షిణ ద్వారములు, ఉపాలయములు, ముఖ మండపములు, తాజా పుష్పంతో అలంకరణలు కొరకు సంక్రాంతి మూడు రోజులు కావలసిన పూల దండలు, విడి పుష్పాలు, ప్రభలు అలంకరణలకు, ఉపాలయములకు దండలు, వి.ఐ.పి.లకు సాధారణ దండలు రవాణా చార్జీలతో కలిపి సరఫరా చేయుటకు అనుభవజ్ఞులైన వ్యాపార సంస్థలు నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్ షెడ్యూల్ ది.20.12.2023 బుధవారం ఉ.10.00 గం. వరకు విక్రయించబడును. సీల్డ్ టెండర్ 20.12.2023 బుధవారం ఉ.10.30 గం. లోపు టెండర్ బాక్స్ నందు సమర్పించవలెను. తదుపరి ధర్మకర్తల మండలి సభ్యులు మరియు దేవదాయ-ధర్మదాయ శాఖ అధికారులు సమక్షములో తెరువబడును.

- దేవస్థానమునకు స్వయముగా వచ్చి ఆలయ అధికారులు సూచించిన అలంకరణలు పరిశీలించి టెండర్ వేయవలెను.
- ధరావత్తు రూ.10,000/- లు సమర్పించవలెను. ఆమోదపు టెండర్ దారు ఆఖరి బిల్ చెల్లింపు సమయములో ధరావత్తు తిరిగి ఇవ్వబడును.
- టెండర్ షెడ్యూల్ ధర రూ.500/-లు చెల్లించి టెండర్ షెడ్యూల్ పొంది వారి ఆధార్ కార్డ్ జిరాక్స్ కార్యాలయం నందు సమర్పించవలెను.
- మిగతా వివరములకు : 9490225812/8074880488/eoainavilli@gmail.com

చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు సం/- కార్యనిర్వహణాధికారి